క్లుప్తంగా

స్టాక్ పాయింట్ పరిశీలన



విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ శ్యామ్‌సుందర్

ఉండి: స్పెషల్ ప్రాథమిక పాఠశాలలోని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష ఏపీసీ శ్యామ్‌సుందర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వచ్చే విద్యా సంవత్సరానికిగాను అందుబాటులో ఉన్న విద్యా సామగ్రి కిట్లను ఆయన పరిశీలించారు. అనంతరం భవితా కేంద్రాన్ని పరిశీలించిన ఆయన కేంద్రం నిర్వహిస్తున్న పాఠశాల భవనం రిపేర్లకు కావలసిన నిధులు మంజూరు చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 వినాయకుడు, సుబ్రహ్మణ్యం, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ నిత్యాన్నదాన పథకం పరిశీలన



మావుళ్లమ్మ నిత్యాన్న దాన పథకాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ దేవస్థానంలో జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి సందర్శించారు. వంటకాలను, రోజుకు ఎంత మందికి పెడుతున్నారు పరిశుభ్రత వంటి విషయాలపై ఈవో బుద్ధ మహాలక్ష్మీనగేష్‌తో మాట్లాడారు. అదే విధంగా దేవస్థానం ఎదురు రోడ్డులో ఎటువంటి భారీ వాహనాలకు అనుమతి లేకుండా చూడాలని, కేవలం ద్విచక్ర వాహనాలకే అనుమతి ఇచ్చి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డిని ఆదేశించారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రావి రాంబాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కాలబైరవ విగ్రహ ప్రతిష్ఠ



కాలబైరవ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: కాలబైరవుని దర్శనంతో పాపాలు హరిస్తాయని పురాణాలు తెలియజేస్తున్నాయని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో మహా శివుని ప్రతిరూపమైన కాలబైరవుడి విగ్రహ ప్రతిష్ఠ గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య ఆర్థిక సాయంతో ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద శాంతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను సీతయ్య, శ్యామలా దేవి దంపతులు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

నూకాలమ్మకు వెండి విరాళం



వెండిని విరాళంగా అందిస్తున్న దాతలు

భీమవరం (ప్రకాశం చౌక్): స్థానిక సిరియాల వారి వీధిలో వేంచేసియున్న శ్రీనూకాలమ్మకు వెండి మకరతోరణం తయారు చేయుటకు భీమవరానికి చెందిన పొన్నాడ నాగరాజు, అరుణ దంపతులు ఈ రోజు 62 గ్రాముల వెండి ఆలయ కమిటీ వారికి విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి తాళ్లపూడి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అధ్వానం

నరసాపురం: స్థానిక మునిసిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. చిత్తశుద్ధి లేకుండా తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించడంతో ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. దీంతో లక్షలు ఖర్చు పెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం నెరవేరకుండా పోతుంది. కొన్నేళ్లుగా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రభుత్వాలు ఏటా అట్టహాసంగా నిర్వహిస్తున్నాయి. పట్టణంలో పలు దఫాలుగా మొక్కలు నాటారు. అయితే వాటి సంరక్షణను మాత్రం అధికారులు గాలికి వదిలేశారు. పట్టణంలో గోదావరిగట్టు, వైఎన్ కళాశాలరోడ్డు, ఎన్టీఆర్‌కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడం లేదు. చాలా చోట్ల నీళ్లు పోయకపోవడంతో ఆ మొక్కలు చచ్చిపోయాయి. మిగిలిన మొక్కలు పశువులు తినేశాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు

- కొద్దిపాటి వర్షానికే మునుగుతున్న రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కాళ్ల: చెరువులను తలపిస్తున్న కోలనపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి



ఆకివీడు: కొద్దిపాటి వర్షానికి చెరువులా మారిన వీధి

కాళ్ల: రహదారుల నిర్మాణం కొన్ని చోట్ల చేపట్టి కొన్నిచోట్ల నామ మాత్రంగా చేయటంతో కొన్ని రహదారులు కొద్దిపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయి. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఆర్ అండ్‌బీ రహదారులు అధ్వానంగా ఉన్నాయని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. దీంతో ప్రయాణానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కాళ్ల మండలంలో కాళ్ల నుంచి కోలనపల్లి మీదుగా ఆకివీడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి కాళ్ల నుంచి కోలనపల్లి వరకు కొంతమేర రహదారి నిర్మించినప్పటికీ కోలనపల్లి నుంచి కుప్పనపుడి వరకు కొంతమేర రహదారి మరమ్మతులు చేయకపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. భారీ గోతులు పడటంతో కొద్దిపాటి వర్షానికే గోతుల్లో నీరు నిలబడి రహదారి చెరువులను తలపిస్తుంది. దీంతో ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వాహదారులు, ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు.

కొద్దిపాటి వర్షానికే చెరువులా మారుతుంది

కొద్దిపాటి వర్షానికే రహదారులు చెరువులను తలపిస్తుంటే భారీ వర్షం వస్తే పరిస్థితి ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. రాత్రి సమయంలో గోతిలో పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అంతే కాకుండా ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామ పరిధి నుంచి ఏలూరుపాడు వరకు రహదారి అధ్వానంగా ఉంది. అదే విధంగా కాళ్ల మండల శివారు పల్లిపాలెం నుంచి ఎస్సీ బోస్ కాలనీ ఆర్‌అండ్‌బీ రహదారి వరకు అక్కడక్కడా మరమ్మతులు చేసినప్పటికీ కొంతమేర వదిలి వేయడంతో ఆర్‌అండ్‌బీ రహదారి ఛిద్రంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఆ రహదారి ప్రయాణం అంటేనే ప్రయాణికులు భయపడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కోలన్నపల్లి రహదారి గోతులను పూడ్చి కనీసం మరమ్మతులు చేయాలని వాహనదారులు, యాణికులు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పిల్ల కాలువలా మారిన మోటుపల్లివారి వీధి రహదారి

ఆకివీడు: సీసీ రోడ్డు ఉన్నా ఆ ప్రాంత ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. దుక్కి వర్షానికే రహదారి పూర్తిగా మునిగిపోయి, నడవడానికి కూడా వీలు ఉండటం లేదు. వర్షం వెలిచిన వారం రోజుల వరకూ నీరు నిలబడి ఉంటుంది. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డులో మోటుపల్లి వారి వీధిలోని ఈ సమస్యను గత కొన్నేళ్లుగా పరిష్కరించాలని స్థానిక వార్డు కౌన్సిలర్ మోటుపల్లి కుమారి మొర పెట్టుకున్నా నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. రహదారికి ఒక వైపున అందే వారి బోదె ఉంది. బోదె గట్టు ఆక్రమణలతో మురుగునీరు, వర్షపు నీరు మురుగు కాలువలోకి వెళ్లడం లేదు. దీంతో వర్షానికి రోడ్డు మునిగిపోయి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఎప్పటికప్పుడు కచ్చా డ్రెయిన్ తవ్వించి ముంపునీటి పారుదలకు చర్యలు తీసుకుంటున్నా ముంపు బెడద పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అందే వారి బోదె ఆక్రమణలను తొలగిస్తున్నట్లుగా ఆ వార్డు కౌన్సిలర్ కుమారికి తెలియకుండా ఇతర వార్డుల్లోని వారు వచ్చి అర్ధ రాత్రి దౌర్జన్యంగా తూరలు పగలగొట్టి, ప్రొక్లయినర్‌తో బోదెను తవ్వినప్పటికీ రోడ్డు పైన ఉన్న మురుగు నీరు మాత్రం బయటకు పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురగునీరు, వర్షపు నీటి పారుదలకు నగర పంచాయతీ కమిషనర్, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు భద్రతపై యాక్షన్ టీమ్ పరిశీలన



ఉప్పుటేరు మలుపు వద్ద రోడ్డును పరిశీలిస్తున్న భద్రత టీమ్ సభ్యులు

ఆకివీడు: రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన యాక్షన్ టీమ్ గురువారం స్థానిక ఉప్పుటేరు వంతెన వద్ద ప్రమాదాల నివారణకు పరిశీలన చేశారు. ఉప్పుటేరు నుంచి ఆకివీడు వైపు వచ్చే రహదారి మలుపు తీవ్రంగా ఉండటం వలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రోడ్డు మలుపు నివారణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. జాతీయ రహదారి నంబర్ 165లో ప్రమాదాల నివారణకు ఆ శాఖ అధికారులు, స్థానిక ఎస్సై, ఆర్‌అండ్‌బీ అధికారులు పలు ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక తెల్ల వంతెన దగ్గర నుంచి చెరుకువాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వరకూ రోడ్డు పలుచోట్ల ప్రమాద భరితంగా ఉందని, ఎత్తు పల్లాలతోనూ, గుంతలతో ఉందని ఆ ప్రాంతంలో రోడ్డు పునర్నిర్మాణం చేయాలని పలువురు యాక్షన్ టీమ్‌కు విజ్ఞప్తి చేశారు. యాక్షన్ టీమ్‌లో ఎస్సై హనుమంతు నాగరాజు, ఎన్‌హెచ్ డీఈ ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ డీఈ సీహెచ్ టీవీఎస్ ప్రసాద్, ఎన్‌హెచ్ సెక్షన్–2 ఏఈ సబీరా అహ్మద్, ఆర్‌అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిబాబు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కేఎస్‌ఎన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆదినాథ్ దేవాలయంలో అజయ్ జైన్ పూజలు



పూజలు నిర్వహిస్తున్న అజయ్ జైన్ తదితరులు

కాళ్ల: పెదఅమిరం ఆదినాథ్ జైన్ దేవాలయాన్ని రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ సందర్శించారు. గురువారం కాళ్ల గ్రామంలో ఆదినాథ్ జైన్ ఆలయాన్ని సందర్శించి, ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, టూరిజం సహాయ సంచాలకులు ఎ.లాజ్ వంతినాయుడు, మేనేజరు ఎ.రాజ్యలక్ష్మి, కన్సల్టెంటు డి.సాహితి, భక్తులు పాల్గొన్నారు.

కొల్లేరును మరిచారు

ఆకివీడు: రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ పర్యటన జిల్లాలో తూతూ మంత్రంగా సాగిపోయింది. జిల్లాలో ముఖ్య పర్యాటక కేంద్రంగా చరిత్రాత్మకమైన కొల్లేరు సరస్సు వైపు కన్నెత్తి చూడకుండానే వెళ్లిపోయారేనే విమర్శలు వెలువడుతున్నాయి. కొల్లేరు సరస్సును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల ప్రజల చిరకాల కోరిక అమలు చేసే దిశగా పర్యాటక ముఖ్య కార్యదర్శి పర్యటన కొనసాగలేదంటున్నారు. కొల్లేరు సరస్సును పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఎంతో ఆదాయాన్నిస్తుంది. కొల్లేరు సరస్సును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే దిశగా ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జైన్ పర్యటన సాగి ఉంటే బాగుండేదని పలువురు పేర్కొంటున్నారు.

పర్స జీవితం ఆదర్శనీయం

భీమవరం: కష్టజీవుల ఐక్యత కోసం చివరి వరకు పోరాడిన పర్స సత్యనారాయణ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం అన్నారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో బి.వాసుదేవరావు అధ్యక్షతన నిర్వహించిన సత్యనారాయణ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తాం



తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేతతో నియోజక వర్గ మేధావి విభాగం కన్వీనర్ చినకృష్ణమూర్తి

ఉండి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మమ్మలను నమ్మి పార్టీ పదవుల్లో నియమించడం ఆనందంగా ఉందని, వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తామని యండగండి సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మేధావి విభాగం కన్వీనర్ గోగులమండ చిన కృష్ణమూర్తి అన్నారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు ఆదేశాలతో తాడేపల్లిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు ఆయన గురువారం యండగండిలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజలకు చేసిన మంచిని మళ్లీ వారికి వివరించడానికి పాటుపడతామన్నారు. కూటమి ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మోసగించి ఏడాది దాటినా ఇప్పటి వరకు హామీలను అమలు చేయలేదన్నారు.

గర్భిణులు ఆరోగ్య సూచనలు పాటించాలి



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు సునీల్

కాళ్ల: గర్భిణులు బీపీతో బాధపడుతుంటే తక్షణమే నిపుణులను సంప్రదించి, ఆరోగ్య సూచనలను పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ తెలిపారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ప్రీ–ఎక్లంప్సియా దినోత్సవ ర్యాలీని వైద్యాధికారి సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు బీపీ రావడం వలన ప్రసవ సమయంలో కష్టమై ఒక్కోసారి తల్లి, పుట్టబోయే బిడ్డ కూడా చనిపోయే ప్రమాదముందన్నారు.ప్రతి నెలా 9వ తేదీన పీహెచ్‌సీలో నిర్వహించే పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో వైద్యాధికారితో పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డి.సునీత, సీహెచ్ఓ డి.విజయవతి, సిబ్బంది పాల్గొన్నారు.

బహుజనులపై దాడులు ప్రభుత్వ వైఫల్యమే



కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌతమ్‌కుమార్

భీమవరం: బహుజనులపై దాడులు, అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన బహుజన సంకల్ప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన బహుజన సంకల్ప సభలు అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో భారీ స్థాయిలో ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాబత్తుల సత్యం, గుమ్మాపు చిత్రసేన, కార్యదర్శులు మురాల రత్నరాజు, ఏలూరి అశోక్, జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల ఏలియారాజు, కొక్కిరి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

పాలకోడేరు: రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని, ఎండీయూ వాహనాలను రద్దు చేసి పాత పద్ధతిలో రేషన్ షాపుల వద్ద డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని డీలర్లు సక్రమంగా నెరవేర్చాలని తహసీల్దార్ నడింపల్లి భారతీవిజయలక్ష్మి అన్నారు. రేషన్ పంపిణీలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు దొంగ కృష్ణ, ప్రధాన కార్యదర్శి సోము సాయి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చినబాబు, సూరిబాబు, కిశోర్, కేవీబీఎల్ కుమారి, ఐ ఉషారాణి, ఎం.సుజాత, ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

కాళ్ల: బీజేపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి తెలిపారు. కాళ్లలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు పానకాల కృష్ణాంజనేయ రావు అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గాదిరాజు వెంకటేశ్వరరాజు, సుంకర కాశీ విశ్వేశ్వరరావు, కొమ్మన నాగబాబు, కొనకంచి సూర్యనారాయణ, కట్రెడ్డి కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటు విషయంలో అప్రమత్తత అవసరం



ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: గర్భిణుల్లో అధిక రక్తపోటు నమోదు కావడం వల్ల ప్రమాదకర లక్షణాలు కనబడతాయని అందువల్ల రక్తపోటు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఓ) సుధాలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అద్దాల ప్రతాప్ కుమార్ అధ్యక్షతన గర్భిణులకు ప్రీ ఎక్లాంప్సియా (గుర్రపు వాతము) పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాలక్ష్మి మాట్లాడుతూ అధిక రక్తపోటు వల్ల ప్రసవ సమయంలో ప్రీ ఎక్లామ్షియా (గుర్రపు వాతము)కు గురవుతూ ఉంటారన్నారు. ఇది గర్భిణుల్లో 24 వారాలు తర్వాత వచ్చే ఎవకాశం ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల ప్రతి గర్భిణీ క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం .నవ్యజీవన్, జిల్లా డీపీహెచ్‌ఎన్‌వో వెంకటరత్నం, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సిబ్బంది ఎలిజిబెత్, స్వామి, సౌజన్య, అమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం అందజేత

యలమంచిలి: జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు ప్రతి నెల చేస్తున్న పేదల సహాయార్థంలో భాగంగా మే నెలకు సంబంధించి గురువారం ఆచంట మండలం వల్లూరు పంచాయితీ చిల్లేవారి పాలెంనకు చెందిన చెల్లెం పుష్పవతికి రూ. 21,000 ఆర్థిక సహాయం చేశారు. పుష్పవతి గుండె వ్యాధితో ఆస్పత్రిలో ఉంటూ ఇబ్బందులు పడుతుందని తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు ఆమెకు వైద్య సహాయం నిమిత్తం ఈ నగదు వితరణ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సునీల్ గవాస్కర్, జీవీఎస్‌వీఆర్‌యం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు గోడ వెంకటేశులు, ఏనుగుపల్లి శేఖర్‌బాబు, తాడి రత్నంరాజు, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పెనుగొండ: ఆచంట మండలం పెనుమంచిలిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఎం.వెంకట్రావును అరెస్ట్ చేసి ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పాలకొల్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలో తనిఖీలు నిర్వహించామని వివరించారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సైలు పి.మహేష్, జి.రఘు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తిరంగా యాత్ర



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పెనుమంట్ర: ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా గురువారం ఆచంట నియోజకవర్గంలో తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఈ ర్యాలీని పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం నుంచి ప్రారంభించి ఆచంట మండలం కోడేరు వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా రామేశ్వరం సెంటర్‌లో జరిగిన ప్రారంభ సభలో ముందుకుగా మాజీ సైనికులు చిట్టూరి సత్యనారాయణ, బాలం రమేష్, దారపు రెడ్డి నాగచంద్రం, జగదీష్‌కుమార్, మన్నె రమేష్‌లను వేదికపై ఘనంగా సత్కరించారు. అలాగే ర్యాలీ మధ్యలో వెలగలేరు నుంచి మార్టేరు సెంటర్ వరకు పాదయాత్ర చేస్తూ సెంటర్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

దాసాంజనేయునికి భక్తిశ్రద్ధలతో పూజలు

- ఘనంగా హనుమద్ జయంత్యుత్సవాలు
- 108 లీటర్ల ఆవుపాలతో స్వామికి అభిషేకం



పాలకోడేరు: మోగల్లులో హనుమాన్ ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషాలు



ఆకివీడు: హనుమద్ జయంతిలో అన్నసమారధనలో పాల్గొన్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీహనుమద్ జయంతి సందర్భంగా దాసాంజనేయస్వామికి జనం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక మారుతీ టాకీస్ సెంటర్‌లో శ్రీదాసాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారికి గురువారం 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకాలను నిర్వహించారు. ఆలయ ఈవో గొట్టుముక్కల సీతారామరాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ఘంటసాల పవన్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు సతీమణి సత్యవాణి శ్రీహనుమద్ జయంతి వేడుకలను ప్రారంభించారు. స్వామి వారికి అష్టోత్తర (108) క్షీర కలశాలతో పూజ, 300 మామిడి పండ్లు, 300 కొబ్బరికాయలు, పంచామృతాలతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహించారు. అనంతరం 3000 అరటి పళ్లతో అర్చన, తులసీదళార్చన, విశేష పుష్పార్చన చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అదే విధంగా సుంకర పద్దయ్య వీధిలోని 25 అడుగుల శ్రీఅభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీహనుమద్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో లంకి చిన్ని, ముచ్చకర్ల శివ, ముచ్చకర్ల సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష తమలపాకుల పూజ

కాళ్ల: అభయాంజనేయునికి తమలపాకులతో పూజలు అత్యంత వైభవపేతంగా నిర్వహించారు. కాళ్ల మండలం పెద అమీరం గ్రామంలో వేంచేసి ఉన్న దాసం అభయాంజనేయ స్వామి వారికి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు గణపతి పూజ, పుణ్య వాహనంతో పాటు లక్ష తమలపాకులతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంపల్లే శివ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలిశెట్టి రాంబాబు దంపతులు, వారి కుమారులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అన్న సమారాధన నిర్వహించారు.

మాలవానితిప్పలో..

జై శ్రీరామ్ అంటూ మాలవానితిప్ప గ్రామం మారుమ్రోగింది. గ్రామంలో వేంచేసి యున్న అభయాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద స్వామివారి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా మండలంలో కాళ్ల, బొండాడ, సీసలి, తదితరు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేగేశ్న రంగరాజు సాగిరాజు సోమరాజు ఎంఎస్ ఎన్ రాజు తదితర పెద్దలు పాల్గొన్నారు.

అంజన్నకు సింధూరం

ఆకివీడు: అంజన్నకు సింధూరంతో అభిషేకాలు చేశారు. ఇటీవల సింధూరం మరింత ప్రత్యేకతను చాటుకుంది. అంజన్న సింధూరం విజయాలకు నిలయమని పలువురు భావిస్తారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో లక్ష తమలపాకుల అర్చన, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక ఆనాల చెరువు వద్ద వేంచేసియున్న అభయాంజనేయస్వామి, పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద వేంచేసియున్న ఆంజనేయస్వామి, దత్త క్షేత్రంలోని పంచముఖ ఆంజనేయస్వామి, వెలంపేట రామాలయంలోనూ, తీగలదొడ్డిలోని భారీ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద, సంతపేట కోదండ రామాలయంలో ఆంజనేయస్వామికి అభిషేకాలు, తమలపాకులతో, సింధూరంతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్‌లు నిమ్మల నాగు, గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, మోటుపల్లి కుమారి, కిమిడి అరుణ కుమారి, పలువురు స్థానికులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



భీమవరం (ప్రకాశంచౌక్): స్వామి వారికి ఆవు పాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు



కాళ్ల: అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి ఉత్సవాలు

పాలకోడేరు: మండలంలోని మోగల్లు, పెన్నాడ తదితర గ్రామాల్లో గురువారం భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతిని ఆయా దేవాలయాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలో పెన్నాడ గ్రామంలో ప్రముఖ దేవాలయమైన భక్తాంజనేయ స్వామి కమిటీ ఆధ్వర్యంలో 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.